విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 12 జూన్ 2024 8 పేజీలు

తెలుగు తమ్ముళ్లలో జోష్..

- సీఎంగా నేడు చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- జిల్లా నుంచి భారీగా తరలి వెళ్తున్న టీడీపీ శ్రేణులు
- ఎమ్మెల్యేలందరూ విజయవాడలోనే
- ఉమ్మడి జిల్లాలో ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం
- పరిశీలనలో స్వామి, గొట్టిపాటి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బుధవారం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం తెలుగు దేశం పార్టీ అధినేతను శాసనసభ పక్ష నేతగా టీడీపీ జనసేన, బీజేపీ, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరయ్యారు. ఆర్భాటంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం జరగనుంది. ఈ సందర్భంగా పలువురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను దర్శి, యర్రగొండపాలెం మినహాయిస్తే మిగిలిన పది జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. గతంతో పోల్చుకుంటే ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఒకరికి అనివార్యంగా మంత్రి పదవి దక్కనుంది. అయితే ఎవరికి మంత్రి పదవి దక్కుతుంది అనేదానిపై అందరిలోను ఉత్కంఠ నెలకొంది. అద్దంకి, పర్చూరు, ఒంగోలు, కొండేపి నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకులు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కొండేపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి మూడు సార్లు విజయకేతనం ఎగురవేశారు. అదే విధంగా జిల్లా కేంద్రమైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మొదటి నుంచి జిల్లా

మిగతా 2 లో

విద్యుత్ వెలుగుల్లో రేపల్లె ప్రభుత్వ కార్యాలయాలు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి నారా చంద్రబాబునాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా రేపల్లె తాలూకా ప్రాంగణంలోని ఎంపీడీవో కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ, తహశీల్దార్ కార్యాలయం తదితర కార్యాలయాలు విద్యుత్ దీప కాంతులతో వెలుగుతున్నాయి. కార్యాలయాలను అందంగా తీర్చిదిద్ది విద్యుత్ బల్బులతో సుందరంగా సంబంధిత అధికారులు తీర్చిదిద్దారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబు నాయుడుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-మార్కాపురం : మాజీ ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు మంగళవారం అమరావతిలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై అన్నా రాంబాబు ఆయన సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మాట్లాడుతూ ఈ ఎన్నికల ఫలితాల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఓటమి తాత్కాలికమేనని, భవిష్యత్తులో పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జగన్ మాజీ ఎమ్మెల్యే అన్నాకు సూచించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎం షమీర్‌అలీబేగ్, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పి యాదవ్‌లు కూడా జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బొప్పూడి గుడిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చినందున, పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించినందు వల్ల పోలూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గడుగోటి కోటేశ్వరరావు దంపతులు బొప్పూడి ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకములు, అర్చనల అనంతరం స్వామి వారికి 110 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి శ్రీనివాసరావు, జంపని శ్రీనివాసరావు, జి.శివయ్య తదితర నాయకుడు పాల్గొన్నారు.

గిద్దలూరులో మేజర్ జనరల్ రాకేష్ మనోచ్ పర్యటన

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో ఆర్మీ అధికారి మేజర్ జనరల్ రాకేష్ మనోచ్ సేన మోడల్ వశిష్ట సేవ మోడల్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఆంధ్ర తెలంగాణ సబ్ ఏరియా పర్యటించారు. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణంలోని ఆర్మీ హాస్పిటల్ ఈ.సి. హెచ్. ఎస్ ను తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో మాజీ ఆర్మీ ఉద్యోగులు, ఆర్మీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ముందుగా కార్యక్రమంలో హాజరైనందుకు వచ్చిన మేజర్ జనరల్ రాకేష్ మనోచ్‌ను స్థానిక సైనికులు, మాజీ సైనికులు ఘనంగా సన్మానించారు. తర్వాత ఆయన మాజీ సైనికులు, సైనికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిద్దలూరు నియోజకవర్గ సైనికులకు మాజీ సైనికులకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా సైనికులు మాజీ సైనికులు ఆర్మీ ఆసుపత్రి భవన నిర్మాణానికి నిరులు మంజూరు చేసి శాశ్వత ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్మీ క్యాంటీన్ సామర్థ్యాన్ని మరింత పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. మరికొన్ని సమస్యలను స్థానిక సైనికులు మాజీ సైనికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తనవంతుగా ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తారని ఆయన హామీ ఇచ్చారు. తర్వాత ఆర్మీ ఉద్యోగులు అంతా కలిసిమెలిసి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆఫీసర్ ఇన్చార్జ్ కల్నల్ ఓం ప్రకాష్ లెఫ్టినెంట్ కల్నల్ వినోద్ కన్వాన్, తదితర సైనికులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మలేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నాగార్జున సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. మలేరియా వ్యాధి ఆడ అనాఫిలస్ దోమ కాటు వల్ల వస్తుందన్నారు. ఇంటా బయట పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి గుంటలను పూడ్చాలని, దోమలు గుడ్లు పెట్టకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవా లన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దానిలో భాగంగా దోమల తెరలు వాడాలన్నారు. పెద్ద దోమలను మనం నాశనం చేయలేము కనుక వారానికి ఒకసారి (ప్రతి శుక్రవారం) గుంటల్లోని నిల్వ నీటిని పారబోయాలని సూచించారు. మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మురళి, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య, విజయ, మాధవి, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటను కలిసిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనువాసులురెడ్డిని పట్టణ రెండవ ఎంపీటీసీ డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలసి శాలవతో సత్కరించి అభినందించారు. ఆకుపాటి వెంట మాజీ ప్రకాశం జిల్లా పశుసంపృదిక శాఖ జిల్లా అధ్యక్షులు కుప్ప రంగా సాయి తదితరులు పాల్గొన్నారు.

పమాణస్వీకారం వీక్షణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - బాపట్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా విజయవాడలో జరుగుతున్న సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరూ ఆ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బాపట్ల పట్టణంలోని అగ్రికల్చరల్ కాలేజ్‌లోని బీవీ నాథ్ ఆడిటోరియం, బాపట్ల పట్టణం విజయలక్ష్మి పురంలోని రోటరీ కళ్యాణమండపం, బాపట్ల మార్కెట్ వద్ద గల ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉదయం 9 గంటల నుంచి బిగ్ ఎల్ఈడి స్క్రీన్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు వీక్షించాలని ఎమ్మెల్యే వేగేశన కోరారు.

సింగరకొండ దేవస్థానానికి టీడీపీ పాదయాత్ర

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు తెలుగు మహిళలు సింగరకొండ దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. గత వైకాపా సర్కారు పాలనలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడంతో ఆయన త్వరగా విడుదల కావాలని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందాలని ఓబన్నపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు సింగరకొండ ఆంజనేయ స్వామికి మొక్కుకున్నారు దాంతో గ్రామ పార్టీ అధ్యక్షులు కట్టా అంజయ్య ఆధ్వర్యంలో పోలినేని రమేష్ కట్టా రాంబాబు పోలినేని పృధ్వి పోలినేని శ్రీదేవి కాపులూరి వెంకటేశ్వరి పోలినేని రజిని కడెం కొండమ్మతో పాటు మరో 20 మంది మంగళవారం వేకువజామున గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర చేపట్టి సింగరకొండ దేవస్థానం చేరుకున్నారు.

డివైడర్‌ని ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడు బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన సాధు వినోద్‌గా గుర్తించారు. 108 సిబ్బంది ద్వారా బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు తమ్ముళ్లలో జోష్..

(మొదటి పేజీ తరువాయి) పార్టీ బాధ్యతలను మోస్తూ పార్టీ ఒడిదుడుకులు, జిల్లా అధ్యక్షులుగా తానే ఒక్కడై ముందుకు తీసుకెళ్లారు. ఇలా ఎవరికివారే పార్టీలో ఉద్దండులు. ఈ నలుగురు మంత్రి పదవి ఆశిస్తున్న వారిలో ముందు వరుసలో ఉన్నారు. అదే విధంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కూడా రెడ్డి కోటాలో మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను జిల్లా విభజన అనంతరం బాపట్ల జిల్లాలో అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలు చీలాయి. అయితే ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావుకు బాపట్ల జిల్లా తరపున మంత్రి పదవి కేటాయిస్తారా లేదా ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికను తీసుకొని వీరిలో ఒకరికి మంత్రి పదవి కల్పిస్తారా అనేది అందరిలో చర్చ జరుగుతుంది. విభజన జరిగిన ప్రకాశం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొండెపి డోలా బాల వీరాంజనేయ స్వామి మంత్రి వర్గ రేసులో బలంగా వినిపిస్తుంది. మూడు సార్లు హ్యాట్రిక్‌గా విజయం సాధించారు. ఇటీవల కాలంలో అసెంబ్లీలో చంద్రబాబుకు వెన్నుదన్నుగా నిలబడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ చేసిన ఆందోళన కార్యక్రమాల్లో డోలా ముందుండి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి డోలాకు మంత్రి పదవి కల్పిస్తారనే అనేదానిపై అందరిలో చర్చ జరుగుతుంది. మొత్తం మీద ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం కొత్తగా ఏర్పడబోయే మంత్రివర్గంలో కూడా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి తప్పకుండా ప్రాతినిథ్యం ఉంటుంది. అయితే విభజనలో విడిపోయిన అద్దంకి, పర్చూరు జిల్లాలకు అవకాశం ఇస్తారా, విభజన అనంతరం 8 జిల్లాలతో కూడిన ప్రకాశం జిల్లాకు అవకాశం కల్పిస్తారా అనేదానిపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. బుధవారం విజయవాడలో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రకాశం జిల్లా నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపికి చెందిన వేలాదిమంది తరలివెళ్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక పాసులు కూడా పంపిణీ చేశారు. గెలిచిన ఉత్సాహంలో ఉన్న కూటమి అభ్యర్థులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను అటు అధికారులు అనధికారులు, రాజకీయ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి దేశ ప్రధాని మోడితో పాటు బీజేపీ అగ్రనాయకత్వం అమిత్‌షా, జెపీ నడ్డాతో పాటు తెలంగాణ, తమిళనాడు తదితర ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు విజయవాడకు తరలివెళ్లారు.

13నుంచి స్కూల్స్ పునఃప్రారంభం

విశాలాంధ్ర-కొమరోలు : రాష్ట్రంలో వేసవి సెలవులను ఈ నెల 12 వరకు పొడిగిస్తు న్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. షెడ్యూ ల్ ప్రకారం 12న పాఠ శాలలు పున: ప్రారం భం కావాల్సి ఉండగా తాజా మార్పుతో 13న రీఓపెన్ అవుతాయని తెలిపింది. 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజర య్యేందుకు వెసులుబాటు కల్పించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం సెలవులను మరో రోజు పొడిగించింది.

శరీరంలో తేమ శాతం తగ్గరాదు

విశాలాంధ్ర- ముండ్లమూరు : చిన్నపిల్లలలో విరో చనాలు ఎక్కువగా అయినప్పుడు శరీరంలో తేమ శాతం తగ్గితే ఇబ్బం దికర పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని వైద్యాధికారులు ఎం.జాస్మిన్, జె.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్సీలో మంగళవారం ఏఎన్ఎంలకు, ఆశాలతో ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ చిన్నారులలో అతి సారా వచ్చినప్పుడు శరీరంలో తేమ శాతం తగ్గిపోయి చర్మం పొడిబారి వారిలో డీహైడ్రేషన్ వలన ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. చిన్నారులలో పరిశుభ్రత లేకపోవడం, మట్టి మీద ఆడుకోవడం, చేతుల్లో కడుక్కోకుండా తినడం వలన అతి సారా లాంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అది సారా నివారణకు జింకు మాత్రలు, ఓఆర్ఎస్ పొడి తాగిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సూపర్వైజర్ సుబ్బారావు, హెచ్వి కన్యాకుమారి, హెచ్ఇ శారద, ఫార్మసిస్ట్ కే యుగం ధర్, మాధవి, ప్రసాదు, దిలీప్, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

విశాలాంధ్ర- పీసీ పల్లి : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని పుర స్కరించుకొని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యషిత ఆధ్వర్యంలో మంగళవారం పీసీపల్లి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యషిత మాట్లాడుతూ దోమ లు వృద్ధి చెందకుండా దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు చేపట్టాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. 2030 సంవత్సరం నాటికి మలేరియా నిర్మూలనకు కలిసి పనిచేద్దామన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో ప్రతిరోజు పొడి వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించా లని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు రేణుకా దేవి సీఏంఒ సుజాత ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : శ్రీనివాసులు

విశాలాంధ్ర-ఒంగోలు : నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు డిమాండు చేశారు. గత నాలుగు మాసాలుగా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం మారింది అధికారులు, పాలకులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈపీఎఫ్ రికార్డులు సరిచేసి కార్మికులకు ఉపయోగపడేలా తగు చర్యలు తీసు కోవాలని, అర్హులైన కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, జిల్లా కేంద్రంలో కార్మికుల కొరకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్మికులు ఇల్లు ఇల్లు తిరిగి చెత్త సేకరించే పుష్కార్టులు నెట్టుడు బండ్లు చక్రాలు సరిగా లేక ఇబ్బంది పడుతున్నారని అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించిన పట్టించుకోకుండా పోవడం దుర్మార్గమని అన్నారు. పెండింగ్లో ఉన్న ఒక్క నెల హెల్త్ అలవెన్స్ 6000 బకాయి కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వంలో అమలు కాని 11వ పీఆర్సీ కార్మికులకు అమలు చేయాలని, 2019 సంవ త్సరం కరోనా కంటే ముందు నియమించిన కార్మికులను చేర్చాలని, గత ప్రభుత్వం అమలు చేయని జీవో నెంబర్ 7 ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్ ఎవరికైనా 15000 వేతనం ఇవ్వమని జీవో చెప్తుందని, గత నాలుగు సంవత్సరాలుగా వాళ్లకి 12000 మాత్రమే ఇచ్చారని దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వీలుగా నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రసారం చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటి పార్క్ వద్ద నిర్వహించనున్న చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యేక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్) కోసం నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం , స్వరాజ్ మైదానం అంబేద్కర్ స్మృతి వనం, పండిట్ నెహ్రు బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ , లెనిన్ సెంటర్, పటమట జడ్పి హైస్కూల్ రైతు బజార్, సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియం, జింఖానా గ్రౌండ్, విద్యాధర పురం స్టేడియం, పాలి టెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణ రైస్ మిల్, సూర్య గోడౌన్, ఎస్ ఆర్ కె ఇంజనీరింగ్ కళాశాల, అను మై బేబీ హాస్పిటల్ ప్రాంతాలలోను, నిడమానూరు బ్లూ బజ్ గ్రౌండ్స్, కెకెఆర్ గౌతమ్ స్కూల్, సవారిగూడెం - కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కృష్ణలంక రాణిగారి తోట మైదానంలలో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఆయా ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్ల ద్వారా ప్రసారం చేసే ప్రత్యక్ష ప్రసార సౌకర్యాన్ని వినియోగించు కొని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు.

15న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఈ నెల 15న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్. రామచంద్రరావు మంగళవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు శాఖల వారీగా పూర్తి సమాచారంతో రావాలన్నారు ఈ సమావేశానికి గైర్హాజరైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజారోగ్య రక్షణలో మెరుగైన పారిశుద్ధ్యం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రజారోగ్య రక్షణలో పారిశుద్ధ్యం కీలకమని కీలకమని పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా 20 వ వార్డులోని సాగర్ నీళ్ల ట్యాంకుల ప్రాంతంలో ప్రజల ఫిర్యాదు మేరకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం గురించి ఫిర్యాదు చేయగా చైర్మన్ ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి ప్రజలతో క్షేత్రస్థాయిలోని సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులు వెంటనే పిలిపించి ఆ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారు ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు మరియు పారిశుద్ధ్యం మెరుగుపడే విధంగా ప్రజలు సహకరించాలని చైర్మన్ కోరినారు. ఈ కార్యక్రమంలో సానిటరీ కార్యదర్శి మాలకొండయ్య, సూపర్వైజర్ ఖాదర్బాషా ఆ ప్రాంత నాయకులు ఖాజా మొహిద్దీన్(బాబు) తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మ తిరునాళ్లు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు గ్రామంలో గత ఐదు రోజుల నుంచి జరుగుతున్న అంకమ్మ తిరునాళ్లు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టుకుని కోళ్లను మేకపోతులను బలి ఇచ్చి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం సాయంత్రం అంకమ్మ తల్లికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన పూలబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రజలకు నష్టం కల్గిస్తున్న ఏఈ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రజల ప్రాణాలు ఆస్తులను నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న డ్రైనేజ్ డిపార్ట్మెంట్ ఏఈ భరద్వాజ ప్రవర్తిస్తున్నాడని బహుజన సమాజ్‌పార్టీ బాపట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి గుదే రాజా రావు ఆరోపించారు. గతంలో కూడా వైఎస్ఆర్సీపీ నాయ కుడు కన్నా మామిడయ్య మూలపాలెం లేఅవుట్ ఎదురు గల నల్లమడ వాగు డ్రైన్ కట్టను సుమారుగా 100 ట్రాక్టర్లు ఇసుక కొట్టు కెళ్లే కంప్లైంట్ ఇవ్వక పోగా అతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. దొరికినకాడికి దోచు కోవడమే అతనికి అలవాటై పోయిందన్నారు. ప్రభుత్వ భూములలో టిప్పర్లతో రాత్రి సమయాల్లో ఇసుక వ్యాపా రంలో సహకరిస్తున్నార న్నారు. కొండుబొట్లవారి పాలెం హైస్కూల్ దగ్గర వైసీపీ నాయ కుడు భవన్నారాయణ సుమారుగా 100 ట్రాక్టర్లు ఇసుక కొట్టుకెళ్తే కంప్లైంట్ ఇవ్వలేదని అతనిపై ఏమి చర్య లు తీసుకోలేదన్నారు. ఇంత జరుగుతున్నా ఏఈ ఎందుకని వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వయిరీ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉప్పుగుండూరు కార్యదర్శి బదిలీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుం దూరు పంచాయతీ కార్యదర్శి హరిబాబు పై బదిలీ వేటు పడింది. ఆయన్ను వినోదరాయునిపాలెంకు బదిలీ చేశారు. అక్కడి కార్యదర్శి వీరయ్యను ఇక్కడకు బదిలీ చేశారు. ఆ మేరకు డీపీవో ఉత్తర్వులు ఇచ్చారు. అది నుంచి వివాద స్పదంగా హరిబాబు తీరు ఉండటంతో ఇప్పటికే ఆయనపై సిబ్బంది, సర్పంచ్, పలువురు స్థానికులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు ఇటీవల ఎంపీడీవోతో దురుసుగా మాట్లాడడంతో ఆమె క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. దీంతో డీపీవో ఆయన్ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

బదిలీ ఆపేందుకు పైరవీలు..

తనపై బదిలీ వేటు పడడంతో దాన్ని ఆపేందుకు స్థానికంగా ఉన్న ఓ రాజకీయ నేతను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో సదరు నేత రంగంలోకి దిగి బదిలీపై ఇక్కడకు రాను న్న వీరయ్యకు ఫోన్ చేసి రావద్దని చెప్పినట్లు సమాచారం. ఇక దీనికి తోడు ఇక్కడి పంచాయతీ కార్యదర్శి హరిబా బును కూడా రిలీవ్ కావద్దని చెప్పినట్లు తెలిసింది. తాము పై స్థాయిలో అన్ని చూసుకుంటామని, అధిష్ఠానం అండదం డలు తమకున్నాయని సదరు నేత చెప్పడంతో హరిబాబు ఉప్పుగుండూరు పంచాయతీకే వచ్చారు. ఇక డీపీఎం ఉత్తర్వులు ఏ మేరకు అమలు జరుగుతాయో చూడాలి.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెనాలి వారి తరుపున బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మం దికీ తెలియచేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని బాపట్ల జిల్లా, మార్టూరు(మం), వలపర్ల గ్రామ కాపురస్తులు కర్రా మధుబాబు గారి భార్య కాయల ప్రేమ దేవత్ గారు ది.01-02-2024న సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.364/2024, యస్.ఆర్.ఓ.భట్టిప్రోలు ద్వారా రిజిస్టర్ పొందియున్నారు. అట్టి ఆస్తిపై నా క్లయింట్ వారి వద్ద నుంచి ఋణ సౌకర్యం అర్థిస్తుంచగా, నా క్లయింట్ ఋణము మంజూరుచేసియున్నారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, కోర్టు జప్తులు, తనఖాలు, ఇతర క్రయములు వగైరాలు వున్నయెడల నాకుగాని, నా క్లయింట్కు గాని ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం రోజులలోగా లిఖితపూర్వకంగా వ్రాతపూర్వకమైన ఆధారాలతో క్రింద చిరునామాలో సంప్రదించ వలెను. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు వగైరాలు నా క్లయింట్ హక్కులను బైండుచేయజాలవు మరియు షెడ్యూలుఆస్తి నిర్వివాద,నిష్కళంకఆస్తిగా భావించబడును.

షెడ్యూలు: బాపట్ల డి॥, రేపల్లె సబ్.డి. నిజాంపట్నం(మం), కూచినపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కూచినపూడి గ్రామం తాలూకు సర్వే నెం.562/1రు మింజుమలె కూచినపూడి గ్రామం తాలూకు పాత డోరు నెం.4-49/ఏరుకు ప్రస్తుత ఇంటిపన్ను దాఖలా క్రొత్త డోరు నెం.2-131రుకు అసెస్మెంట్ నెం.331రు గల ఆర్.సి.సి. దాబా ఇల్లు, నివేశన స్థలముకు హద్దులు. తూర్పు:పంచాయితీ బజారు,దక్షిణం : కర్రా రవికుమార్ గారి ఇల్లు స్థలం, పడమర: కోపూరి వసంతరావు గారి ఆస్తి, ఉత్తరం: పంచాయితీ బజారు.ఈ హద్దుల మధ్య చ.గ.121లు నివేశన స్థలము, సదరు స్థలంలో గల చ.అ.580లు ఆర్.సి.సి. దాబా ఇల్లు మరియు యావ ద్వీశిష్టములతో సహా.

కె. హరికృష్ణ, అడ్వకేట్

డోర్.నెం.22-7-15, కొత్తపేట, తెనాలి. సెల్: 9440751659

ఎంపీ మాగుంటకు టీడీపీ శ్రేణుల అభినందనలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివా సులు రెడ్డిని, కొనకనమిట్ల మండల టిడిపి నాయకులు మంగళవారం, ఒంగోలు మాగుంట కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాగుంటను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కా పురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్, కందులు రామిరెడ్డి. కొనకనమిట్లమండల టిడిపి అధ్యక్షులు ఎం బాబురావ,. తెలుగు యువత జిల్లా కార్యదర్శి మువ్వా కాటమరాజు, మార్కాపురంనియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుకుదేవ్, టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం నాయకులు కోనంకి సాల్మన్, టిడిపి నాయకులు కనకం నరసింహారావు, తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కిలార బొంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎంసెట్లో 'శ్రీహర్షిణి'కి ర్యాంకులు

విశాలాంధ్ర- ఒంగోలు: ఏపీ ఎంసెట్ 2024 ఫలితాలలో శ్రీహర్షిణి విద్యార్థులు మంచిర్యాంకులు సాధించారు బైపిసి విభాగంలో ఆవుల అర్చన రాష్ట్ర స్థాయిలో 5435 ర్యాంకు గొర్రె ముచ్చు అనూష 779 వ ర్యాంకు అదే విధంగా ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయి 813 వ ర్యాంకు ఎడమ కంటి జాహ్నవి 9 9 ర్యాంకు లను సాధించారు 12 మంది విద్యార్థులు 10,000 కు పైగా ర్యాంకులను సాధించారు మరియు శిక్షణ తీసుకున్న 85 మంది విద్యార్థులలో 80 మంది క్వాలిఫై అయ్యారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ గారు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

డాక్టరేట్ పొందిన రమణారావుకు ఘనసన్మానం

విశాలాంధ్ర-కురిచేడు : పొట్లపాడు గ్రామానికి చెందిన వివి రమణారావు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కురిచేడు లైన్స్ క్లబ్ అధ్యక్షులు మధ్యకాలంలో ఊటీ యందు గౌరవ డాక్టరేట్ ఇంటర్నేషనల్ ఫిష్ సిటీ యందు సోషల్ సర్వీస్ విభాగం క్రింద గౌరవ డాక్టరేట్ పొంది ఉన్నారు. ఇతనికి మంగళవారం దర్శి ఎస్‌టిఓ సుబ్బారావు మస్తాన్ నాయక్ తదితర సిబ్బంది పొట్లపాడు గ్రామంలో ఘనంగా సన్మానించారు. గ్రహీత వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏ వెంకటస్వామి ఎస్‌విఎల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గేదె మృతి

విశాలాంధ్ర-కొమరోలు : అల్లినగరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైతు మోడీ చిన్న పోచయ్యకు చెందిన 65 వేల విలువ గల గేదె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో చనిపోయిందని, తనను ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

ఏపీ ఇఏపీసెట్‌లో శ్రీ సరస్వతి ప్రభంజనం

విశాలాంధ్ర-ఒంగోలు : ఏపీ ఇ ఏపీ 2024 ఫలితాలలో శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఒంగోలు పరిధిలోని పెర్న మిట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతి ఐఐటి, నీట్ క్యాంపస్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమణా రెడ్డి మాట్లాడుతూ ఏపీ ఏపీ 2024 ఫలితాలలో అసాధారణ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 425 ఉత్తమ ర్యాంకు సాధిం చినట్లు పేర్కొన్నారు. కే సాకెట్ సాయిరాం రాష్ట్రస్థాయిలో 425 ర్యాంకు, ఆల్ చంద్రవిహారిక 1076 వ ర్యాంక్, కె గోపీచంద్ 1275 వ ర్యాంక్, ఎన్ ఇంద్రసేన రెడ్డీ 1592 వ ర్యాంక్ సాధించారన్నారు. 2 వేల లోపు 4 గురు విద్యార్థులు, 10 వేల లోపు 32 మంది, 20 వేల లోపు ర్యాంకులను 89 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్లు ఏ గణేష్ రెడ్డి, ఈ గంగా శంకర్ రెడ్డి, సీఈఓ ఎన్వి సురేష్, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

కేవీఆర్ స్టార్ లైట్ విజయకేతనం

- ఫిజిక్స్‌లో 50కు 41 ప్రశ్నలు
- నీట్ 2024లో 645 మార్కులతో అగ్రస్థానం
- టీఎస్,ఈ ఏపీ సెట్ మెడికల్ విభాగంలో స్టేట్ 622, 1015 ర్యాంకు

కేవీఆర్ స్టార్ లైట్ అకాడమీ భవనం

అధినేత కేవీఆర్

విశాలాంధ్ర- ఒంగోలు: నీట్ 2024లో ఫిజిక్స్‌లో 50 ప్రశ్నలకు గాను 41 ప్రశ్నలు కె.వి.ఆర్ స్టార్ లైట్ నీట్ అకాడమీ అందజేసిన వర్క్ షీట్ల నుండి, నోట్స్, క్వశ్చన్ పేపర్ల నుండి రావటం ఫిజిక్స్ కె.వి.ఆర్ ప్రత్యేకత. ప్రతి ఏడాది 60 శాతం మంది విద్యార్థులు డాక్టర్ సీట్లను సాధిస్తూ విజయ పరంపరలో కొనసాగుతున్న విద్యా సంస్థ. స్థాపించిన ఆరు సంవత్సరాల కాలంలో 280 మందికి పైగా డాక్టర్లను అందించిన మెడి కల్ అకాడమీ. ఈ ఏడాది నీట్ 2024 ఫలితా లలో 720 మార్కులకు గాను నాగ సాయి 645 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమంగా నిలవటమే కాకుండా, ఫిజిక్స్ లో 98.6% మార్కులు సాధించడం విశేషం. కేవలం అకాడమీలో కాకుండా ఆన్లైన్ ద్వారా కెవిఆర్ స్టార్ లైట్ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఫిజిక్స్ కోసం చేరటం విశేషం. వైజాగ్, తుని, హైదరా బాద్, విజయవాడ, కర్నూల్, అనంతపురం, కడప, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాల నుండి విద్యార్థులు ఫిజిక్స్ క్లాస్‌లను ఆన్లైన్లో విని, కెవిఆర్ స్టార్ లైట్ లో నీట్ కోసం చేరటం విశేషం. ఈ సందర్భంగా కెవిఆర్ స్టాల్ లైట్ అధినేత కెవిఆర్ మాట్లాడుతూ అకాడమీ స్థాపించిన నాటినుండి తమ విద్యార్థులు ప్రతి ఏడాది ఫ్రీ మెడికల్ సీట్లు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. 2018లో మొదటి బ్యాచ్ గా 16 మంది విద్యార్థులకు ఉచిత ఎంబి బిఎస్ సీట్లు, 2019లో22 మంది విద్యార్థులు, 2023లో 31 మంది విద్యార్థులు, 2024లో 34 మంది విద్యా ర్థులు ఉచిత మెడికల్ సీట్లు సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు కేవలం ఫిజిక్స్ కోసం ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ఆన్లైన్లో కెవిఆర్ క్లాస్ విని, తర్వాత వారి వారి కాలేజీ లకు వెళ్లటం గొప్ప విషయం అన్నారు. కష్ట తరమైన ఫిజిక్స్ సబ్జెక్టును జీరో నుండి ప్రారంభించి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకుపోతున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులో నాలుగు స్వంత భవనాలలో క్లాసులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలికలకు ప్రత్యేకమైన క్లాసులతో పాటు, ప్రత్యేకమైన హాస్టల్లో వసతి కలదు అన్నారు. యాజమాన్యమే ఫిజిక్స్ లెక్చరర్ కావడం కె.వి.ఆర్ స్టార్ లైట్ అకాడమీ కి కలిసి వచ్చిన అంశం. ఈ ఏపీ సెట్ లో తమ విద్యార్థి నాగ సాయి మెడికల్ విభాగంలో 1015 స్టేట్ ర్యాంక్ సాధించినట్లు కె.వి.ఆర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలు కోసం యూట్యూబ్లో కెవిఆర్ స్టార్ లైట్ అకాడమీ సైట్‌లో చూడవచ్చన్నారు.

ప్రతి నిర్మాణానికి అనుమతులు ఉండాలి

బావుడ ప్లానింగ్ అధికారి, వైస్ చైర్మన్ కె. బాబురావు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడ) పరిధిలో చేపట్టే ప్రతి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించి అనుమతులు తీసుకున్న అనంతరం నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బావుడ వైస్ చైర్మన్ బాబురావు అన్నారు. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజక వర్గాలతో పాటు, కాకుమాను, పెదనందిపాడు మండలాల పంచాయతీ కార్యదర్శులకు మంగళ వారం బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావుడ పరిధిలో ఉన్న రెండు పురపా లక సంఘాలతో పాటు పంచాయతీలకు కూడా ప్రతి నిర్మాణంకు అనుమతులు తప్పనిసరి అని, ప్రతి నిర్మాణానికి బహుళ అంతస్తులతో సహా అనుమ తులు తీసుకున్న అనంతరం మాత్రమే నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయితి పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులను మ్యానువల్‌గా కాకుండా ఆన్లైన్ విధానాన్ని బావుడ అమలు చేస్తుందని, ఆన్లైన్ విధానంలో లైసెన్సేడ్ టెక్నికల్ పర్సనల్ ద్వారా దరఖాస్తు చేయించి పంచాయితీలకు సంబంధించిన ఫీజులు, బావుడా అభివృద్ధి ఫీజులు చెల్లించిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు అనుమతులు మంజూరు చేయాలని వివరించారు. 300 చదరపు మీటర్లలోపు నిర్మించు నివాస భవన నిర్మాణానికి అనుమతి మంజూరు చేయు అధికారం పంచాయితీ కార్యదర్శులకు, ఆపై స్థల విస్తీర్ణములలో, నివాసేతర నిర్మాణానికి అనుమతులు ఇచ్చు అధికారం బావుడాకు ఉందని, నూతన ఆన్‌లైన్ విధానం పై పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించి పంచాయతీ పరిధిలలో ప్రణాళికా బద్దంగా భవనాలు, లేఔట్లు నిర్మించి పంచాయితీల అభివృద్ధికి పాటుపడవలసిందిగా, పంచాయతీ కార్యదర్శులు బావుడ సిబ్బంది సమన్వయంతో పనిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. అనుమతుల మంజూరులో ఆలస్యం కాకుండా త్వరితగతిన భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ పిఓ శంకర్రావు, డిఎల్ పిఓ స్వరూప రాణి, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ ఎలీషా బాబు, పంచాయతీ కార్యదర్శులు, లైసెన్సేడ్ టెక్నికల్ పర్సన్స్, బావుడ సిబ్బంది నరేష్, దివ్య, భార్గవ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

భయాందోళనకు గురవుతున్న పట్టణ ప్రజలు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె పట్టణంలో పలు వార్డుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద భరితంగా ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభ సమయం దగ్గరపడటంతో విద్యార్థులు రాకపోకలు సాగించే రహదారుల్లోనే నేలకు తక్కువ ఎత్తులో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన వైర్లు కిందకి ఉండటం ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవి స్తుందోనని పట్టణవాసులు ఆందోళన చెందుతు న్నారు. పట్నంలోని ఓపెన్ థియేటర్ ఎదురు రోడ్డులో, అరవపల్లి రోడ్‌లోని కోత మిషన్ వద్ద, 25వ వార్డులోని మసీదు సమీపంలో, రామకోటి పేట రామాలయం సమీపంలో, చంద్రమౌళి పార్క్ వెనుక రోడ్డులో పోస్ట్ ఆఫీస్ రోడ్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒక్కటి కూడా ఫెన్సింగ్ అనేది లేదు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యుత్‌శాఖ అధికారులను కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ళు

విశాలాంధ్ర - చీరాల రూరల్: మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల ఆభరణాలతో, పుష్ప మాలికలతో అలంకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. శిడిమాను ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రీడా సామాగ్రి దుకాణాల వద్ద పిల్లల సందడి కనిపించింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోమల వల్ల ప్రజలకు వచ్చే వివిధ రకాల జ్వరాల గురించి వివరించి దోమలను లార్వా దశ లోనే నాశనం చేసే విధానం తెలియజేసి ప్రజలు దోమలు కుట్టకుండా తీసుకోవలసిన తగు జాగ్రత్తలను వైద్యురాలు డాక్టర్ ఎన్. చంద్రిక వివరించారు. మలేరియాకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు సిబ్బందికి ప్రజలకు సూచించారు.

మలేరియా అనేది చలి, వణుకు విపరీతమైన జ్వరంతో కూడుకున్న వ్యాధి అని, ఇది ప్లాస్మోడియం అను పరాన్న జీవి వల్ల వస్తుం దన్నారు. ఈ వ్యాధి అనాఫిలస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వర్షాకాలంలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స లేకపోతే నెలల తరబడి బాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో నాగేశ్వరరావు, మండల సూపర్ వైజర్ నరసింహారావు, జానీ, ఏఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

నత్త నడకగా మినీ ఇండోర్ స్టేడియం పనులు

ఎదురుచూస్తున్న క్రీడాకారులు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు నత్త నడకగా సాగుతున్నాయి.గత రెండు సంవత్సరాల క్రితం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున రావు, మున్సిపల్ చైర్మన్ కట్ట మంగలు శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి ప్రారంభమైన నిర్మాణ పనులు గత రెండు సంవత్సరాలుగా నత్త నడకగానే సాగుతు న్నాయి. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి క్రీడాకారులకు పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు ప్రజలు, క్రీడాకారులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ వెలుగులలో ప్రభుత్వ కార్యాలయాలు

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి నారా చంద్రబాబు నాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బాపట్లలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీప కాంతులతో వెలుగుతున్నాయి. ఈ కార్యాలయాలను సంబంధిత అధికారులు అందంగా తీర్చిదిద్ది విద్యుత్ బల్బులతో సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబు నాయుడుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

కర్లపాలెంలో :

నాలుగో సారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని

ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో విరజిల్లుతున్నాయి. స్థానిక తహశీల్దారు, మండల పరిషత్ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబు నాయుడుకు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ ప్రవేశానికి 25 లోగా దరఖాస్తు

ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె నియోజకవర్గం పరిధిలోని నిజాంపట్నంలో గల మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెరిట్ మార్కుల సాధించిన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుంకర వెంకట్ నారాయణను పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామ సీపీఐ సీనియర్ నాయకులు సుంకర వెంకట్ నారాయణ అనారోగ్య కారణంగా ఎన్నారై హాస్పటల్ నందు చికిత్స పొందుతున్నారు. ఆయనను మంగళవారం సాయంత్రం సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, షేక్ జాన్‌సైదా, పొదిలి మరియదాసు, తదితరులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కోలాహలంగా పోలేరమ్మ తిరునాళ్లు

విశాలాంధ్ర - పెదనందిపాడు : పెదనందిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ మంగళవారం కోలాహలంగా జరిగింది. మహిళలు గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి తలంటు కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. చౌదరీస్ యూత్ ఆధ్వర్యంలో ప్రభను ఏర్పాటు చేసి మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్ ఎన్ బి కోల్డ్ స్టోరేజ్ అధినేత నంగినేని నరేంద్రబాబు ఏర్పాటుచేసిన కాంతారా, కాళికాదేవి, హనుమాన్ ల వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గుడి నిర్వాహకులు భారీవిద్యుత్తు ప్రభను నిర్మించి తిరునాలకు శోభను తీసుకొచ్చారు. పూజారులు కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పొన్నూరు ఎంఈఓ రుద్రపాటి శోభా చంద్ సస్పెన్షన్

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం విద్యాశాఖ అధికారి రుద్రపాటి శోభా చంద్ సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై వాట్సాప్ గ్రూపులో తప్పుడు ప్రచారం చేయడంపై జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. వాస్తవమని తేలడంతో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి సస్పెండ్ చేశారు. జగన్ ఫాలోవర్స్ గ్రూపులో పోస్టులు పెట్టడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి.

శ్రీ బాలాజీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర- వినుకొండ : మార్కాపురం రోడ్డులో శ్రీ బాలాజీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయము నందు లారీ ఓనర్ల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లారీ ఓనర్ల నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లారీ ఓనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి రామిరెడ్డి ఎన్నికవ్వగా వైస్ ప్రెసిడెంట్ గా బి.వి. కోదండరామయ్య, సెక్రటరీగా వై. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా ఎస్ కె.షరీఫ్, ట్రెజరర్‌గా వీర్రాజు, గౌరవ అధ్యక్షులుగా దొడ్డ అనంతరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను లారీ ఓనర్స్ సభ్యులు పూలమాలలు, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని లారీ ఓనర్ల సమస్యలపై దృష్టి సారించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా ముందడుగు వేస్తామని తెలియజేశారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో

సత్తా చాటిన భాష్యం విద్యార్థులు

విశాలాంధ్ర - గుంటూరు కార్పొరేషన్ : ఏపీ ఈఏపీ సెట్ - 2024 ఫలితాలలో భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితా లలో ఎం. జిష్ణుసాయి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎం. సాయి యశ్వంత్ రెడ్డి స్టేట్ 2వ ర్యాంకు, కె. మనీష్ చౌదరి 5వ ర్యాంకు, కె.ప్రభాస్10వ ర్యాంకు, కె.హర్షిత స్టేట్ 16వ ర్యాంకు, ఎస్.ప్రణయ్ విక్టర్ 25వ ర్యాంకు, ఎం.శ్రీచరిత సాయి 29వ ర్యాంకు, టి.మునికార్తీక్ 35వ ర్యాంకు, పి.శ్యామ్ 49వ ర్యాంకు, కె.చైతన్య 54వ ర్యాంకు, ఎం.సాయి జస్వంత్ రెడ్డి 61వ ర్యాంకు, ఆర్.రాజ్ శ్రీవర్ధన్ స్టేట్ 83వ ర్యాంకు వంటి 100లోపు 12 స్టేట్ ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని రామకృష్ణ పేర్కొన్నారు. భాష్యం విద్యార్థులు వరుసగా రెండో సారి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడంతో పాటు టాప్ టెన్లో నాలుగు ర్యాంకులు కైవసం చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో తిరుగులేని ఫలితాలు సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కూడా భాష్యం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఈఏపీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేవారు.

బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణా తరగతులు

ఛైర్మన్, డాక్టర్ ఈవీ నారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలలో తొలి బ్యాచ్‌లోనే 50 శాతం అభ్యర్థుల విజయం సాధించిన ఉత్సాహంతో ఇప్పుడు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ నిరుద్యోగులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు, ఛైర్మన్, డాక్టర్ ఈవి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ బుధవారం 9 గంటలకు పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్యపురంలో ఈ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, డాక్టర్ వడ్లమాని రవి, కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత అడిషనల్ కమిషనర్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఎకాడమిక్ డీన్ వై. సత్యనారాయణ, ఇన్కమ్ టాక్స్ విశ్రాంత ఉన్నతాధి కారి బొలగాని గోపీనాథ్, జీఎస్టీ చీఫ్ కమిషనర్, ఎస్. రవిశంకర్ నారాయణ్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు తదితర ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల ప్రవేశ పరీక్షలలో అత్యంత అనుభవం గల నిపుణు లైన అధ్యాపకులతో, ఆర్థిక భారం మోయలేని, నిరుద్యోగ యువతకు, కేవలం ఫ్యాకల్టీకి, ఇతర నిర్వహణ ఖర్చులకు మాత్రమే సరిపడే, అతి తక్కువ ఫీజులతో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పెమ్మసానికి ఆత్మీయ ఆహ్వానం

విశాలాంధ్ర - గుంటూరు : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర సహాయమంత్రిగా పూర్తిస్థాయి బాధ్య తలు తీసుకుంటాను' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూని కేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య, ఎం.సింధియాను ఢిల్లీలో డాక్టర్ పెమ్మసాని విడివిడిగా మంగళవారం కలిశారు. తమను కలిసేందుకు వచ్చిన పెమ్మసానిని ఇరువురు కేంద్ర మంత్రులు ఆత్మీ యంగా ఆహ్వానించారు. కేంద్ర మంత్రులకు పుష్ప గుచ్ఛం ఇచ్చిన అనంతరం పెమ్మసాని శాలువాతో చిరు సత్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ ఇరువురు నాయకులను కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ సమస్యలపై త్వరలోనే పూర్తి వివరాలు అందజే స్తానని, అలాగే గ్రామీణ అభివృద్ధితో పాటు కమ్యూనికేషన్స్, గుంటూరు పార్లమెంట్ పురోగతి దిశగా పని చేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బుధవారం జరగ బోయే చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్ర మం అనంతరం తాను పూర్తిస్థాయిలో కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తానని కేంద్ర మంత్రులకు పెమ్మసాని వివరించారు. పెమ్మసానితో పాటు ఆయన సతీమణి డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న కూడా ఉన్నారు.

సాంబయ్యకు నిత్యావసర సరకుల పంపిణీ

విశాలాంధ్ర - సత్తెనపల్లి : ప్రజా చైతన్య భారతి ఆధ్వర్యంలో బియ్యం సరుకులను కార్మికునికి అందజేశారు. మంగళవారం వీరాంజనేయ నగర్‌లోని తోపుడు బండి తోలుకుంటూ జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్న ఎస్ సాంబయ్య దంపతులకు ప్రజాచైతన్య భారతి ఆధ్వర్యంలో బియ్యం సరుకులను అందించారు. ఈ కార్యక్రమంనకు ఎస్ సీతయ్య పెద్దింటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు డి. జానకి రామయ్య ప్రతి నెల రెండు సేవా కార్యక్రమలు తగ్గ కుండా చేయాలనీ సభ్యులు అందరు తీర్మానం చేసారని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యక్షులు పి. ఆంజనేయులు కోశాధికారి మల్లేశ్వరావు సెక్రటరీ కె.ప్రేమ్‌కుమార్ నాసరయ్య ప్రసాద్ పి. రామకోటయ్య భవిరిశెట్టి సుబ్బారావు చల్లా పెద మస్తాన్‌రావు ఎ.ప్రభుదాస్ శ్రీరామ్మూర్తి హరిబాబు పి.పెద్దన్న రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనురాధకు మంత్రి పదవి ఇవ్వాలి

విశాలాంధ్ర - పెదకూరపాడు : ఎమ్మెల్సీ అనురాధకు మంత్రి పదవి ఇవ్వాలని పల్నాడు జిల్లా జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులు చిల్లపల్లి సత్యం

చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ ఏపీ శాసన మండలి సభ్యులు పంచుమర్తి అనురాధ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శాసన మండలికి ఎంపిక అయిన చేనేత వర్గానికి చెందిన ఏకైక మహిళా నేత అని, చంద్రబాబు నాయుడు అరెస్ట్ సమయంలో నారా భువనేశ్వరి వెంట నిజం గెలవాలి కార్యక్రమంలో అండగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చేనేత రంగం కూడా గత ప్రభుత్వ విధానం వలన అన్ని రాయితీలు ప్రోత్సాహకాలు కోల్పోయారని, చేనేత వర్గానికి చెందినవారు పరిపాలన బృందంలో ఎవరూ లేకపోవటమే ఇందుకు కారణమన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బండారు వేంకటేశ్వర్లు, గ్రామ మహిళా కమిటీ అధ్యక్షురాలు సామ్రాజ్యం, వెంకట్రావ్, రామారావు, బ్రహ్మయ్యతో పాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

దాడి కేసులో వైసీపీ నేతల అరెస్ట్

విశాలాంధ్ర-రెంటచింతల : గత నెల 12న తెదేపా పోలింగ్ ఏజెంట్లు సిద్దయ్య, మల్లయ్యలపై దాడికి పాల్పడిన ఘటన నిందితులైన వైసీపీ నేతలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం. ఆంజనేయులు తెలిపారు. ఉమా మహేశ్వరరెడ్డి వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, మహేష్ రెడ్డి, రామయ్య, కోటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, శ్యామేల్, రామాంజనేయ రెడ్డిలను మాచర్ల కోర్టులో హాజరు పరిచారు. వీరికి 14 రోజుల రిమాండ్ విధించారు. వెంటనే గుంటూరు సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

పెదకూరపాడును అభివృద్ధి పథంలో నడిపించాలి

విశాలాంధ్ర - పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం జనసేన ఆధ్వర్యంలో తాళ్లూరు సాయిబాబా దేవాలయం నుండి మల్లాది వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య టీడీపీ నేతలు పాల్గొని మాట్లాడుతూ పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గెలిస్తే పాదయాత్ర చేస్తామని గెలిచిన సందర్భంగా పాదయాత్ర చేసినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించాలని దేవుని ప్రార్థించినట్లు వారన్నారు. భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా ప్రవీణ్ పని చేస్తారని, ఈ గెలుపు ప్రజా గెలుపని ఆమె అన్నారు. ముఖ్యంగా 75 తాళ్లూరు టీడీపీ, జనసేన నేతలు అనేక సమస్యలు ఎదురైనప్పటికీ పార్టీ కోసం కష్టపడి ప్రవీణ్ గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి వెంకటరెడ్డి, జన్నవరపు కోటిరెడ్డి, నియోజవర్గ ఎస్సీ సెల్ నాయకులు జంగాల ప్రసాదు, దాయుద్ దత్తు, యన్నం శ్రీనివాసరెడ్డి, కళ్ళం సుందర్ రామిరెడ్డి, రావులపాటి అనిల్, బలుసుపాటి శ్రీనివాసరావు, పోతుకుంట గోపి రాజేష్, కొల్లి బ్రహ్మారెడ్డి, జనసేన నేతలు గంటా శ్రీనివాసరావు, గంట రమేష్, గంటా సుబ్బారావు, నాగేశ్వరరావు, లంక నాగరాజు, ఆవుల శంకర్, ధనలక్ష్మి, సీతామహాలక్ష్మి, నరసమ్మ, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా పాఠ్య పుస్తకాల సరఫరా

విశాలాంధ్ర - రెంటచింతల : పాఠశాలలు పునఃప్రారంభం కానున్న తరుణంలో పాఠ్య పుస్తకాలను సకాలంలో అందించాల్సిన అధికారులు వాటి సరఫరాలో జాప్యం చేస్తున్నారు. దీంతో పాఠశాలలు తెరిచే లోగా అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలు అందుతాయా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. మండలంలోని 38 పాఠశాలలకు దాదాపు 42 వేల పాఠ్యపుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 15,226 పాఠ్య పుస్తకాల సరఫరా మాత్రమే జరిగింది. అదేవిధంగా స్టూడెంట్ కిట్స్ 3,626 మాత్రమే అందాయి. సెమిస్టర్-1లో కొన్ని పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా, సెమిస్టర్-2లో పుస్తకాలను ఇంకా సరఫరా చేయలేదు. 6,7 తరగతులకు గణితం, సైన్స్, ఆంగ్లం సాంఘికశాస్త్రం పుస్తకాలు సరఫరా కాలేదు. సెమిస్టర్-2లో 1 నుంచి 5 తరగతులకు గణితం, పర్యావరణ పుస్తకాలు సరఫరా చేయలేదు. 6 నుంచి 10వ తరగతుల వరకు సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం, గణితం పుస్తకాలు సరఫరా కూడా అంతంత మాత్రమే. 7వ తరగతికి హిందీ పాఠ్య పుస్తకాలు సరఫరా లేదు. మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు పాఠ్య, నోటు పుస్తకాల సరఫరా ప్రస్తుతం ఆగింది. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్స్ సరఫరా చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై గ్రామాల్లో ప్రచారం

విశాలాంధ్ర - రొంపిచర్ల : మండలంలో పలు గ్రామాలలో మంగళవారం త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమం జరిగింది. మండలంలో పరగటిచర్ల గ్రామంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న త్రైత సిద్ధాంత - ప్రబోధ ఇందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాప వచ్చునని అన్నారు. ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి ఉపయోగపడుతుందని, ప్రజలలో దైవభక్తి పెంపొందించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని త్రైత సిద్ధాంత భగవద్గీత దోహదపడుతుందన్నారు. అదేవిధంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను గురించి ప్రచారం చేశారు.

ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకట్రామి రెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై సమీక్ష

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉన్న ప్రతి పేషంట్‌కు నూటికి నూరు శాతం వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జీజీహెచ్ లోని నాట్కోలో ఆరోగ్యశ్రీ రోగులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతి పేషంట్‌కు ఆరోగ్యశ్రీ అందలేదని బాధపడకుండా ఉండేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డిఎంఈ, మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రులతో సమీక్ష చేస్తారని అయన చెప్పారు. ప్రతి వైద్యుని ఆరోగ్యశ్రీ పని తీరు గురించి సమీక్ష చేస్తారని, ఎన్ని ఆరోగ్య కేసులు చేస్తున్నారా లేదా అనేది వైద్యుల పని తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన కూడా చేస్తున్నారని అయన చెప్పారు. ఈ విషయంలో ప్రతి వైద్యుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వైద్యుడు వ్యక్తిగత పని తీరును మెరుగుపర్చుకోవాలని, ఆరోగ్య మిత్ర పర్యవేక్షణ పూర్తిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఉండాలన్నారు. లేకపోతే ఆరోగ్య మిత్రల ద్వారా పని చేయించుకోవడం కష్టంగా ఉంటుందని అయన చెప్పారు. ఆరోగ్య మిత్ర సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని, సెలవు దినాల్లో కూడా కొంతమంది పనిచేస్తూ ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు పథకం అందేవిధంగా కృషి చేయాలన్నారు. అందుకు ఆరోగ్య జిల్లా కో-ఆర్డినేటర్ సహకరించాలన్నారు. ప్రతి వార్డులో వైద్యులు, ఆరోగ్య మిత్ర, డిఈఓలతో సమన్వయంతో పని చేస్తూ ఆరోగ్యశ్రీని బలోపేతం చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీలో 40 మంది పని చేశారని, వారందరూ వివిధ విభాగాల్లో పని చేశారన్నారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి వారి అవసరాలను గుర్తించి ప్రతి నెల అయిదు లక్షల జీతాలు చెల్లిస్తున్నామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక విభాగం హెచ్ఓడి డాక్టర్ ఉమాజ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కిరణ్, జాయింట్ డైరెక్టర్ సుధారాణి, ఏడి సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన షాపులలో ఏడీఏ మస్తానమ్మ తనిఖీలు

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని విత్తన షాపులను నరసరావుపేట ఏడిఏ మస్తానమ్మ, స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. వివిధ విత్తన షాపులలో స్టాక్ రిజిస్టర్లను, ఇన్వాయిసులను, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లను, స్టాక్ నిల్వలను పరిశీలించారు. సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్స్ లేకుండా డీలర్లు ఎవరు విత్తనాలు అమ్మవద్దని ఆదేశించారు. ఎవరైనా అనుమతి పత్రాలు లేకుండా విత్తనాలు విక్రయించినట్లయితే విత్తన చట్టం 1983 ప్రకారం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న వైద్య సేవలు

విశాలాంధ్ర-రెంటచింతల : రెంటచింతలలో అతిసారం నివారణకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు నర్రా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వడ్డెర బావి వీధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 33 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. నర్సరావుపేట వైద్యాధికారి రాజారావు అధ్వర్యంలో పది చోట్ల నీటి నమూనాలు సేకరించారు. గుంటూరు వైద్య శాలకు పరీక్షల నిమిత్తం పంపించారు. మురుగు కాల్వలలో ఉన్న మంచినీటి పైపులు తొలగించే వరకు మినరల్ వాటర్ తాగాలని రెంటచింతలలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు దండోరా వేయించారు.

ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఈ నెల 15, 16, 17 తేదీలలో ఉచితంగా వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, ఈ నేపధ్యంలో ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని స్టెప్ ప్రిన్సిపల్ డాక్టర్ బత్తుల క్రిష్ణయ్య, రాష్ట్ర కో-ఆర్డినేటర్ పావని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కొరిటిపాడులోని స్టెప్ కార్యాలయంలో 'ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేసి నిష్ణాతులైన సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ ఇవ్వబడుతుందని తెలియజేశారు. ఈ శిక్షణకు హాజరు కావాలనుకునే వారు 9666813833, 7386883244 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, శరత్, మల్లికార్జున్, సతీష్ బాబు, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - గుంటూరు : ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అందరికంటే ముందు వరుసలో నిలిచారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ మంగళవారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జె.మోహన్‌రావు మాట్లాడుతూ వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన ఐ.హనీత్ (387), టి. సంజయ్ తేజ (494), ఏ. రోహన్ (904), సీ. రేవంత్ (957), పీ. అమర లోకేష్ (1015), పీ. గౌతమ్ (1195), కే.కారుణ్య (1206), ఎం. నాగసాయి ప్రకాష్ (1219), బీ. యోగ విజయ్ కుమార్ (1369), సీహెచ్. వెంకట ఉదయ్, ఆదిత్య (1377), కే. దక్షిత్ (1777), ఎం. వివేక్ పూజిత్ కుమార్ (1964) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధమైన విద్యాబోధన వల్లనే అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

విశాలాంధ్ర – చీరాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా విజయవాడలో జరుగుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం వీక్షించే విధంగా చీరాల పట్టణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్లో ఉదయం 9 గంటల నుంచి బిగ్ ఎల్ఈడి స్క్రీన్‌లలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామని చైర్మన్, వైస్ చైర్మన్లు, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఆఫీసు సిబ్బంది, వార్డు సెక్రటరీలు, వాలంటీర్లు అందరు పాల్గొనాలని చీరాల మునిసిపల్ కమీషనర్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు.